## క్లుప్తంగా

### రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ భోజన్న

లోకేశ్వరం: అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ భోజన్న అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జీపీవోలతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జీపీవోలకు సంబంధిత రెవెన్యూ రికార్డులను క్లస్టర్‌వారీగా సరిచేసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. గ్రామాల్లో ఎలాంటి రెవెన్యూ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


శ్రీహరిరావుకు వినతిపత్రం స్తున్న గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం యాకర్‌పల్లి, వంజర్ గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుని క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలిశారు. యాకర్‌పల్లి నుంచి వంజర్ గ్రామాన్ని కలుపుతూ స్వర్ణ వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని శ్రీహరిరావు హామీఇచ్చారు. నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, సారంగాపూర్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, జంగిటి సందీప్, రాజేశ్వర్‌రెడ్డి, మధాస్తు రాజేశ్వర్, గజేందేర్ పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల నిరసన


నిరసన తెలుపుతున్న రేషన్ డీలర్లు

నిర్మల్‌చైన్‌గేట్: రేషన్ డీలర్లకు రావల్సిన ఆరు నెలల కమీషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత ఏప్రిల్ నుంచి కేంద్రం కమీషన్, సెప్టెంబర్ నెలకు సంబంధించి రాష్ట్ర కమీషన్ అందలేదన్నారు. సకాలంలో అందక రేషన్ డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దసరా, దీపావళి పండుగలు దృష్టిలో పెట్టుకుని కమీషన్ వెంటనే చెల్లించాలని కోరారు.

### అనర్హులను తొలగించకుంటే ఆందోళనలు


ఆందోళన చేస్తున్న పేదలు

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని అనర్హులను తొలగించకుంటే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట పేదలతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పీటర్, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో 400పై చిలుకు లబ్ధిదారులు ఉన్నప్పటికీ అధికారులు 150 మంది పేర్లను మాత్రమే విచారణ చేయడం సరికాదన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, ఇళ్ల సాధన సమితి నాయకులు తోట రాధ, పద్మ, గౌస్, అన్వర్, జమీర్‌ఖాన్, ప్రమీల ఉన్నారు.

### సౌకర్యాలు కల్పించాలి

ఖానాపూర్: త్వరలో జరగబోయే బతుకమ్మ ఉత్సవాలు పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గౌరికార్ రాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని అనేక చోట్ల రోడ్లపై గుంతలతోపాటు వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిమజ్జనం నాటికైనా ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్



లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామ ప్రాథమిక పాఠశాల ఎదుట ప్రధాన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా ఉంది. దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు తరచుగా కింద పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### 'మురుగు' తొలగించరూ..



లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఎస్సీ కాలనీ వద్ద ప్రధాన రోడ్డుపైనే మురుగునీరు నిలుస్తోంది. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## 'సద్దుల' సంబురం


బంగల్‌పేట్ పీహెచ్‌సీలో..


బైంసాటౌన్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు


తానూరు మండలం బెల్‌తరోడాలో బతుకమ్మతో వెళ్తున్న భక్తులు డ్యాన్సర్ బిట్టు, మహిళలు

నిర్మల్‌చైన్‌గేట్/తానూరు/కుంటాల/బైంసాటౌన్/నర్సాపూర్(జి)/లక్ష్మణచాంద: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. రామరామ రామ ఉయ్యాలో.. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..అంటూ పాటలతో ఊరూవాడ మార్మోగింది. జిల్లాలో పలుచోట్ల సోమవారం సద్దుల బతుకమ్మ జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడలి వద్ద పెట్టి మహిళలు ఆడిపాడారు. యువతులు, చిన్నారులు, విద్యార్థినులు కోలాటాలతో నృత్యాలు చేశారు. రాత్రి వరకు ఆడి అనంతరం బతుకమ్మలను సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ పీహెచ్‌సీలో జరిగిన సంబురాల్లో డీఎంహెచ్‌వో రాజేందర్ పాల్గొన్నారు.


నర్సాపూర్(జి): వేడుకల్లో కాలనీవాసులు


కుంటాల: లింబా(బి)లో


లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడి టీచర్లు

### దుబాయ్‌లో..

నిర్మల్‌ఖిల్లా/కుంటాల: దుబాయ్‌లో ఎమిరేట్స్ ఆఫ్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (ఈటీసీఏ) ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల్లో జిల్లావాసులు పాల్గొని ఆడిపాడారు. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన ఈటీసీఏ ప్రతినిధి చెన్నాజీ భువనేందర్, ప్రవాసీమిత్ర కార్మిక సంఘం నాయకులు మెంగు అనిల్ తదితరులు వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. కుంటాలకు చెందిన మాజీ ఎంపీపీ జీవీ అరుణ రమణారావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో డల్లాస్‌లో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.


వేడుకల్లో పాల్గొన్న మహిళలు


డల్లాస్‌లో వేడుకల్లో మహిళలు

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ నగేష్

లోకేశ్వరం/కుంటాల/ఖానాపూర్/బైంసారూరల్/సోన్/దస్తురాబాద్/నర్సాపూర్(జి)/నిర్మల్‌ఖిల్లా/లక్ష్మణచాంద/నిర్మల్‌టౌన్: జిల్లాలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు వెంకటాచారి పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ నందిగుండం దుర్గామాతను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయన్ను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. బైంసా మండలం వానల్‌పాడ్‌లో స్వయంభుగా వెలిసిన దుర్గమ్మను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి దర్శించుకున్నారు.


బైంసారూరల్: కుంకుమార్చనలో మహిళలు

### ఎన్నికల సిబ్బందికి శిక్షణ


బైంసాటౌన్: శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

బైంసాటౌన్/తానూరు/లోకేశ్వరం/సారంగపూర్/కుంటాల/నర్సాపూర్(జి)/దస్తురాబాద్/లక్ష్మణచాంద/ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధి విధానాలతోపాటు నిర్వహణ, నిబంధనల గురించి వివరించారు. మాస్టర్ ట్రైనర్లు పీవో, ఓపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవోలు సుధాకర్‌రెడ్డి, నసిరొద్దీన్, సోలమాన్ రాజ్, లక్ష్మీకాంత్‌రావు, అల్లాడి వనజ, రమాకాంత్, రమేశ్, ఎంపీవోలు చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, అజీజ్‌ఖాన్, రత్నాకర్‌రావు, అనిల్, ఎంఈవోలు చంద్రకాంత్, సుభాష్, ముత్యం, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

### దేశరక్షణ కోసం ముందుండాలి

కుంటాల: దేశ రక్షణలో ప్రతి పౌరుడు ముందుండాలని ఆర్ఎస్ఎస్ జిల్లా గో సేవాప్రముఖ్ కొత్తకాపు నారాయణ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యాపూర్ రైతు వేదికలో నిర్వహించిన విజయదశమి ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హిందువులంతా ఐక్యంగా ఉండి, విశ్వశాంతికి పాటుపడాలని కోరారు. సనాతన జీవన విలువలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: దేశ నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత టోలీ సభ్యులు జనగాం నరేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ లక్ష్మణచాంద శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. విజయ్ కుమార్, ఆకారపు చిన్నయ్య, స్వయం సేవకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు .

## బ్యానర్ తొలగించడంపై నిరసన

నిర్మల్‌టౌన్: బ్యానర్ తొలగించడంపై ఓ వర్గానికి చెందిన పలువురు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో ఓ వర్గానికి సంబంధించిన బ్యానర్‌ను తొలగించారని వారు ఆరోపించారు. ఈ విషయమై నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారికి సర్దిచెప్పి, స్టేషన్ వద్ద నుంచి పంపించేశారు. అనంతరం జిల్లా ఎస్పీ జానకీ షర్మిలను కలిసి వినతిపత్రం అందజేశారు.

**ఇద్దరి పోలీసులు హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్..**

ఆదివారం రాత్రి ఓ వర్గం ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన ఇద్దరు పోలీసులను పట్టణ పోలీస్‌స్టేషన్ విధుల నుంచి తప్పిస్తూ ఎస్పీ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వారిని జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈఘటనపై విచారణ చేసి నివేదించాలని ఏఎస్పీ రాజేష్‌మీనాకు ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై ఎవరైన సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఓ వర్గానికి చెందిన నాయకులు నాయకులు

## పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీవోగా..


ప్రదీప్

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన జాదవ్ పుష్ప-విశ్వంభర్ దంపతుల కుమారుడు ప్రదీప్ ఇటీవల వెలువడిన గ్రూప్-2 ఫలితాల్లో 362 ర్యాంకు సాధించి ఎంపీవోగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన బాసర మండలంలోని కిర్గుల్ (బి) పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-1లో ప్రతిభ కనబర్చి ఆర్డీవోగా ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని ప్రదీప్ తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

**ఎంపీవోగా భీమేశ్**


భీమేశ్ (ఫైల్)

సోన్: గ్రూప్-2 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన అష్టం భీమేశ్ సత్తాచాటి మండల పంచాయతీ అధికారిగా (ఎంపీఓ)గా ఎంపికయ్యాడు. ఇదివరకే గ్రూప్-4 ఉద్యోగం సాధించి ఆసిఫాబాద్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎంపీవో ఉద్యోగం సాధించిన భీమేశ్‌ను గ్రామస్తులు, కుటుంబసభ్యులు, తోటి స్నేహితులు అభినందించారు.

**ఎంపీవోగా శ్రీనివాస్**


శ్రీనివాస్

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఇటీవల గ్రూప్- 2 ఫలితాల్లో 273 ర్యాంకు సాధించి ఎంపీవోగా శ్రీనివాస్ ఎంపికయ్యారు. ముత్తవ్వ-నర్సయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సయ్యకు ఉన్న మూడు ఎకరాల్లో పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడో కుమారుడైన శ్రీనివాస్ 2008 డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ముధోల్ మండలం చింతకుంట తండాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తు పట్టుదలతో గ్రూప్స్‌కు ప్రిపేరయి సత్తాచాటాడు. ఎంపీవోగా ఎంపికైన ఆయన్ను స్థానికులు అభినందించారు.

**ర్యాంకు సాధించిన వ్యక్తికి సన్మానం**

నిర్మల్‌రూరల్: గ్రూప్-1 ఫలితాల్లో ర్యాంకు సాధించి ఆసిఫాబాద్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందిన జోయల్ నిస్సిని సోమవారం కాలనీవాసులు సన్మానించారు. జిల్లా కేంద్రంలోని చత్రపతి కాలనీలో ఏర్పాటుచేసిన అభినందన సభలో సంక్షేమ సంఘ సభ్యులు నిస్సికి పూలమాల, శాలువా కప్పి సత్కరించారు. కాలనీవాసులు కష్టమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నీటమునిగిన వైకుంఠధామాలు

- అంత్యక్రియలకు ఇబ్బందులు
- భారీ వరదకు కొట్టుకుపోతున్న శవాలు
- పొలంగట్లపై ఖననం, రోడ్లపై దహన సంస్కారాలు
- పట్టించుకోని అధికారులు

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని బాదనకుర్తి, మస్కాపూర్ తదితర చోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వైకుంఠధామాలు గోదావరి తీరంలో నిర్మించారు. వర్షాకాలంలో భారీ వరదలకు నీట మునిగిపోతున్నాయి. బాదనకుర్తిలోని వైకుంఠధామం షెడ్డు కూలిపోవడం, మస్కాపూర్‌లో దెబ్బతినడంతోపాటు వరదనీటిలో మునిగింది. దీంతో అంత్యక్రియలకు ఇబ్బందిగా మారింది. పట్టణంలోని గోదావరి నది ప్రవాహ ప్రాంతంలో సుమారు రూ.70 లక్షలతో వైకుంఠధామం నిర్మించారు. గోదావరి నది ఒడ్డున స్థల సేకరణ చేసి నిర్మించాల్సిండగా గత ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గం అనాలోచిత నిర్ణయంతో చేపట్టారు. గతంలో స్థానిక ప్రజలు, వీడీసీ నాయకులు గోదావరి ఎగువన గల పంట పొలాల సమీపంలో స్థల సేకరణ చేసి నిర్మించాలని కోరిన బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యాంగా పనులు చేపట్టారు. ఏటా గోదావరికి వచ్చిన భారీ వరదకు అవి నీట మునిగిపోతున్నాయి. నిర్మించిన కొన్నినెలలకే నీట మునిగింది. నీరు తక్కువగా ఉన్న సమయంలో పలువురు దహన సంస్కారాలు చేస్తుండగా, కాసేపటికే నీరు ఉధృతి పెరిగి సగం కాలిన శవాలు కొట్టుకుపోయిన సందర్భాలు నెలకొన్నాయి. అలా శవాలను తిరిగి వెతికి తెచ్చి దహనం చేశారు. కొన్నిచోట్ల పొలం గట్లపై ఖననం, రోడ్లు, సదర్మాట్ ఒడ్డున దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. పట్టణ పరిధిలో గత మూడేళ్లగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మృతుల బంధువులు, పట్టణ ప్రజలు పాలకవర్గం, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతుల పేరుతో నిధుల వృథా..**

వరదనీటిలో దెబ్బతిన్న వైకుంఠధామాన్ని మరమ్మతు చేసేందుకు అధికారులు ఏటా లక్షల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. దీనికి గత పాలకులు కారణమని అంటున్నారు. ఏడాదిగా ఖానాపూర్‌లో దుస్తులు మార్చుకునే గది పైకప్పు వేయకపోవడం, తలుపులు ఏర్పాటు చేయకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన వారు అవస్థలు పడుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


వరదనీటిలో మునిగిన ఖానాపూర్ వైకుంఠధామం


బాదనకుర్తిలో వైకుంఠధామం ప్రాంతంలో ప్రవహిస్తున్న గోదావరి వరదనీరు

### ప్రజాధనం దుర్వినియోగం

గత మున్సిపాలిటీ పాలకవర్గం తప్పుడు నిర్ణయాలతో గోదావరి నది పరీవాహక ప్రాంతంలో వైకుంఠధామం నిర్మించారు. ప్రజాధనం దుర్వినియోగం అయింది. గోదావరి ఒడ్డున స్థలం సేకరించి నిర్మిద్దామని ఖానాపూర్ వీడీసీ సూచనలు బేఖాతారు చేశారు. – మైలారపు గంగాధర్, మాజీ సర్పంచ్, ఖానాపూర్

### పాలకులకు వత్తాసు

పాలకులకు అధికారులు వత్తాసు పలికారు. ఇష్టారాజ్యాంగా నిర్మాణాలు చేపట్టారు. నాలుగేళ్లుగా ప్రతీ ఏడు వైకుంఠధామాలు నీటిలో మునిగిపోతుంది. దెబ్బతిన్న వైకుంఠధామాన్ని లక్షల రూపాయలతో మరమ్మతు చేసిన మళ్లీ నష్టం వాటిల్లుతుంది. ఖానాపూర్‌లో రెండేళ్లుగా మహిళలు దుస్తులు మార్చుకునే గదుల్లేవు.
– గుమ్ముల రాజేందర్, శ్రీరాంనగర్, రైతు

## ముంచెత్తిన గోదావరి వరద


ధర్మారం వద్ద మునిగిన పంటలు

లక్ష్మణచాంద: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గోదావరి పరీవాహక గ్రామాల రైతుల పంటలను వరద ముంచెత్తింది. సోమవారం ఉదయం నుంచి ఎస్సారెస్పీ నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువనకు గోదావరిలో వదిలారు. పీచర, ధర్మారం, మునిపెల్లి, పార్‌పెల్లి, మాచాపూర్, చింతల్‌చాంద గ్రామాల రైతులకు చెందిన వందల ఎకరాల పసుపు, మొక్కజొన్న, సోయా, పత్తి పంటలు నీటమునిగాయి. నెల వ్యవధిలో రెండోసారి నీళ్లు రావడంతో పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్డుపై స్నానాలు**

పీచర గోదావరి నదికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉధృతంగా నీరు ప్రవహించింది. దీంతో మామడ మండలంలోని పలు గ్రామాల ప్రజలు నది వద్దకు వెళ్లకుండా రోడ్డుపై స్నానాలు ఆచరించారు. నది ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పంటలపై నుంచి పారుతున్న నీటిలో స్నానాలు ఆచరించి వెళ్లారు.

### 'అడవిసారంగాపూర్‌లో రిజర్వేషన్ మార్చాలి'

ఖానాపూర్: వందశాతం గిరిజనులు ఉన్న అడవిసారంగాపూర్ గ్రామంలో బీసీ రిజర్వేషన్ ప్రకటించడం సరికాదని దీన్ని మార్చి ఎస్టీ రిజర్వేషన్ ప్రకటించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని పటేళ్ల, సార్‌మేడిలు, గ్రామ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అంకుశ్‌రావ్, లింగు, బీంరావు, బాదు, మాణిక్‌రావు పాల్గొన్నారు.

### పరామర్శ

ముధోల్: మండల కేంద్రానికి చెందిన విలేకరి రాహుల్ తండ్రి ఇటీవల మృతి చెందారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావు పటేల్ సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముధోల్ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి పాల్గొన్నారు.